



# స్నేహానికి నిర్వచనం

కోమలాదేవి

యువ 01-01- 1973




**కాలేజీ ఆవరణలో** అడుగుపెట్టగానే శాంతి అడుగులు తడబడినై. ఓ విధమైన భయం – జంకు పిరికితనం తన్నావరించినై బిక్కుబిక్కుమంటూ వెళ్తున్న ఆమె వేపు సీనియర్ విద్యార్థినులు చులకన భావం ద్యోతకమయ్యే చూపుల్ని ప్రసరిస్తూ, నిర్లక్ష్యంగా ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు ఆ రోజే కాలేజి తెరచిన రోజు కావటం మూలాన గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటూ అల్లరిగా తిరుగుతున్న అమ్మాయిలవేపు చూస్తూ అసూయపడింది శాంతి. ఆ దశ తాను దాటిపోయింది. మరిహ జన్మలో అంత ఉత్సాహంగా స్వేచ్ఛగా ఆనందంగా జీవితం గడపలేదు.

ప్రిన్సిపాల్ గదిలోంచి బైటికొచ్చిన శాంతి ముఖంలో కొంగ్రొత్త వెలుగు ప్రకాశిస్తోంది. ఆమె చక్కగా పలుకరించారు. ధైర్యం చెప్పారు. ఇకనేం కావాలి? ధైర్యంగా స్టాఫ్‌రూం వేపు నడిచింది.

శాంతి ఇంగ్లీషు లెక్చరర్‌గా జేరింది. తనకన్నా ఒక్క సంవత్సరం సీనియర్స్ అయిన రమ, పద్మలతో స్నేహం కలిసింది. రమకూడా ఇంగ్లీషు లెక్చరర్‌గానే పనిచేస్తోంది. పద్మ అసిస్టెంట్ లెక్చరర్. ముగ్గురు కూడా మిసెస్ నళినీ

రామారావు క్రింద పనిచేస్తున్నారు. నళిని వీరందరికన్నా పది పన్నెండు సంవత్సరాలు పెద్దది. మంచి అనుభవం కలది. చక్కగా లెక్చర్స్ ఇస్తారని, షేక్స్పియర్ చాలా బాగా చెబుతారని ఆమెను అందలం ఎక్కించేశారు పిల్లలు. గంభీరంగా, మౌనంగా వుండే ఆమెను చూస్తే విద్యార్థినులకు హడలు. అటొస్తే ఇటు తప్పించుకుని వెళ్తుంటారు. నళిని స్వతహాగా కలుపుగోరుతనం మనిషికాదు. రిజర్వ్‌డ్ టైప్. ఆమె అంటే మిగతా ముగ్గురికి కూడా భయమూ గౌరవమూను.

శాంతి, రమ, పద్మలు గాఢ స్నేహితులైపోయారు. ముగ్గురు ఒకే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఏడాదిలోపల రమ పెళ్ళిచేసుకుని పక్క ఇంట్లోకి భర్తతో సహా వెళ్ళిపోయింది. మరో ఆరుమాసాలకు పద్మకు కూడా పెళ్ళయిపోయింది. కానీ వారి స్నేహం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. కాలేజీలో వీరి స్నేహాన్ని గుర్తించి, మిగతావారు శాంతిని "మీరెప్పుడు మీ స్నేహితుల అడుగుజాడల్లో నడుస్తారు?" అని అడిగితే శాంతి నవ్వి ఊరుకునేది.

రమ – పద్మలు పెళ్ళయి వేరుగా వెళ్ళిపోయినా శాంతిని దూరం చేసుకోలేదు. ఒకే వీధిలో ఉండటం వల్లనో లేక వారి భర్తల ప్రోత్సాహంవల్లనో ఐదుగురు కలిసి, మార్చి మార్చి ఒక్కో ఇంట్లో భోజనాలు చేసుకోవటమో – సినిమాలకు వెళ్ళటమో , లేదా ఏవైనా సభలు జరిగితే ఉమ్మడిగా హాజరుకావటమో జరిగేది.

ఇంతలో పెద్ద అవాంతరమొకటి వచ్చిపడింది.

రమ – పద్మలు ఇద్దరు కూడా ఒకేసారి మెటర్నిటీ లీవ్ పెట్టవలసి వచ్చింది.

ఆ రోజు ఐదుగురు కలసి ఈ విషయం మీద మాట్లాడుకుంటున్నారు. శాంతి గాబరాపడ్తోంది.

"ఇంకో నెలకంతా బి.ఎ వాళ్ళ ఫైనల్ పరీక్షలు. ఇంకా నాలుగు ఎస్సేలు పూర్తికావాలి. ఇంటర్ వాళ్ళ డ్రామాకూడా పూర్తికాలేదు. మీరిద్దరూ ఒకేసారి ఇంట్లో కూర్చుంటే నేనూ, మిసెస్ నళిని పూర్తిచేయగలమా?" సంశయిస్తూ అంది. అందరూ దీర్ఘాలోచనలో మునిగిపోయారు.

"వెధవ స్ట్రైకులు వీళ్ళూను. కాలేజి మూసేయగానే రైళ్ళెక్కి చక్కగా ఇళ్ళకు వెళ్ళిపోతారు. మరో నెలరోజులకు చక్కగా కాలేజికొస్తారు. అదే అత్తవారింటికొచ్చినట్లు. నాలుగురోజులు కాపురం వెలగబెట్టి ఏదో పేచీలు తెచ్చి పుట్టింటికి పారిపోతారు. అవస్థపడేది మనం. వాళ్ళు పరీక్ష హాల్‌లోకి వెళ్ళక ముందు పోర్షన్స్ ముగించి పంపాలి. ఎలా సాధ్యం? ఈ ఏడాది, రెండున్నర నెలలు ఇలా వృధాగా పాడైపోయాయి. నీపై పెద్ద భారాన్నే మోపుతున్నాము. పోనీ త్వరగా పాఠాలు ముగిద్దామన్నా పిల్లలు ఏకగ్రీవంగా శని ఆదివారాలు సెలవరోజుల్లో రామని గోల పెట్టేస్తారే. ఏం చెయ్యాలి?" రమ తన సానుభూతి కనపరుస్తూ తన నిస్సహాయతను తెలియజేసింది. కొంతసేపు మగవాళ్ళిద్దరూ నాటి విద్యార్థిలోకంలో ఉన్న అసమర్ధతను, అవినీతిని, అవిధేయతను, పొగరును గురించి యధేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అంతసేపూ ఆడవాళ్ళు ముగ్గురు దీర్ఘాలోచనలో మునిగిపోయారు.

చటుక్కున పద్మ అంది "పోనీ మరొకరి సహాయం తీసుకుంటేనో? రాంగోపాల్‌గార్ని నేనెరుగుదును. అటుపోయిన సంవత్సరం మోడర్న్ పొయిట్రీ వారే తీసుకుని ముగించారు. వారి సహాయాన్ని అర్థిస్తే?"

రమ వదనం ప్రఫుల్లమైంది. "నిజమే బలే ఐడియా. నాలుగు క్లాసులు తీసుకొమ్మని అడిగితే తప్పక ఒప్పుకుంటారు."

శాంతి హృదయం తేలిక పడింది.

"ఐతే రేపు సోమవారం నాడు మిసెస్ నళినిని అడిగి, వారిని అడగటానికి వెళ్తాను" అంది ఎంతో ఉత్సాహంగా.

పద్మ భృకుటీకరించి కచ్చితంగా అంది. "సోమవారందాకా ఆగితే నీకు తోడెవరు? ఇప్పుడు మేమున్నాము. ఇప్పుడే వెళ్దామా? నళినిగారికి ఇలాంటి పట్టింపులు లేవు. పోర్షన్స్ అయిపోవటమే ముఖ్యమంటారు. పద్మ రమలతో వెళ్ళి అడిగానని చెప్పు. ఏమీ అనరు. ఇప్పుడే మళ్ళీ రిక్వెస్ట్ చేద్దామా?"

సరేనంటే సరేననుకున్నారు.

రాంగోపాల్‌గారు అదృష్టంకొద్దీ ఇంట్లోనే ఉన్నారు. వచ్చిన ఐదుగుర్నీ చూసి ప్రథమంలో గాభరాపడిన మాట వాస్తవమే కానీ వారొచ్చిన కారణం తెలుసుకుని సంతోషంగా అంగీకరించారు.

"ఐదు గంటలైతే చాలు" అని అతడికి వీలైన సమయాన్ని ఓ కాగితం మీద వ్రాసి యిచ్చారు. అతడిచ్చిన ఇన్‌స్టెంట్ కాఫీ త్రాగి సంతోషంగా అందరు తిరిగొచ్చారు.

మరుసటి రోజు శనివారం. పద్మ రమలకు ఆఖరి రోజు. ముగ్గురు కలసి నళిని దగ్గరకెళ్ళారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్, నళిని బైట కారిడార్‌లో మాట్లాడుకుంటున్నారు. పద్మ – రమలను చూసి ప్రిన్సిపాల్ అంది. "మీరిద్దరు వెళ్ళిపోతున్నారు. పోర్షన్ అవలేదని ఈవిడ చాలా వర్రీ అవుతున్నారు."

శాంతి చటుక్కున అంది. "భయం లేదండి. రాంగోపాల్‌గారు గవర్నమెంట్ కాలేజి ఇంగ్లీష్ లెక్చరర్. వచ్చి మోడర్న్ పొయిట్రీ పూర్తిచేస్తానని చెప్పారు."

ప్రిన్సిపాల్ ముఖం గంభీరమైంది. కాస్త కోపంగా నళినికేసి చూసి అంది.

"ఎవరినడిగి ఇలా హెల్ప్ కోసం వెళ్ళారు?"

శాంతి గుండెల్లో రాయిపడింది. రమ, పద్మలు ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు.

"నాకు తెలియదండీ" అని ప్రిన్సిపాల్‌కు జవాబిచ్చి, శాంతివైపు తిరిగి చికాకుగా అంది.

"రాంగోపాల్‌గారి దగ్గరకు మాకు తెలీకుండా ఎలా వెళ్ళారు?"

ఇదేదో చిక్కు ప్రశ్నలా ఉందని తన ప్రత్యక్షత అనవసరమని గ్రహించిన ప్రిన్సిపాల్ "వస్తాను" అంటూ వెళ్ళిపోయారు. శాంతికి ముచ్చెమటలు పోశాయి. నళిని ఎందుకిలా అడుగుతోంది? ఓమారు పద్మ, రమల వైపు సహాయం కోసం చూసింది. పద్మ ముఖం త్రిప్పేసుకుందిగాని, రమ ఓ క్షణం శాంతి కళ్ళలోకి చూసింది.

శాంతి ఇరకాటంలో పడిపోయింది. రమ మెల్లగా అంది. "అటుపోయిన సంవత్సరం వారు హెల్ప్ చేశారని ఈమాటుకూడా హెల్ప్ చేస్తారని అనుకున్నాము. మావారు, రాంగోపాల్‌గారు స్నేహితులు. నిన్న వారింటికి వెళ్ళాము. మాటల సందర్భంలో అడిగాము, అఫ్‌కోర్స్ అఫిషియల్‌గా మీ నించి ఆహ్వానం వస్తుందని చెప్పాము."

"అటుపోయిన సంవత్సరం అది వేరే సంగతి. ప్రిన్సిపాల్ అభ్యంతరం పెట్టలేదు. కానీ ఈ సంవత్సరం ఆమెకి ఎందుకో ఇష్టంగాలేదు. మనమే ఎలాగో పూర్తి చేయాలి. ఐనా శాంతీ ఇకమీదట ఇట్లాంటి పొరపాటు చేయకండి .పర్మిషన్ తీసుకోవాలి, ప్రిన్సిపాల్ ద్వారనో, నాద్వారానో ఆహ్వానం వెళ్ళాలి" శాంతి మాట్లాడలేదుగాని పద్మ తనను వెనకేసుకొచ్చి సర్ది చెబుతుందని గంపెడాశతో చూసిందిగాని, పద్మ శాంతిని చూడలేదు. అసలు శాంతి అక్కడ లేనట్లే ప్రవర్తిస్తోంది. శాంతి హృదయం విలవిల్లాడిపోయింది.

నేరస్థురాలు తానే. అపరాధినిలా నిలబడి మౌనం దాల్చింది. కానీ తనకు తెలుసు. నళినికి ఏదో జవాబివ్వాలని, కాసేపాగి మెల్లగా అంది "అంతదూరం ఆలోచించలేదు. పొరపాటు జరిగిపోయింది. క్షమించండి."

"ఇకపై జాగ్రత్తగా ఉండు శాంతీ" అని నళిని వెళ్తుంటే, ఈ పద్మ ఆమెననుసరించింది. పద్మ వెళ్ళిన దిక్కుకేసి నిస్త్రాణతో చూస్తూ నుంచుండిపోయింది. రమతో ఏదో మాట్లాడాలనుకుంటుండగానే కొంతమంది విద్యార్థినులు రమను చుట్టుముట్టారు. శాంతి అక్కడనించి దాటిపోయింది.

ఆఖరు రోజని కాబోలు, రమ, పద్మలకు అవిరామంగా గడిచింది. సాయంత్రం ఇల్లుచేరగానే శాంతి మంచమ్మీద వాలిపోయింది. నళిని దగ్గర నేరస్థురాలిలా క్షమాపణ కోరటం తనను అంతగా బాధపెట్టటంలేదుగాని, ఈపని చేయించిన వ్యక్తి తనను పురికొల్పి రాంగోపాల్ దగ్గరికి తీసుకెళ్ళిన వ్యక్తి అంతా తనకు తెలిసినట్లు, నళిని తన మాటను తీసివేయనట్లు మాట్లాడిన పద్మ, మౌనం దాల్చటం తనకేమీ తెలియనట్లు, పట్టనట్లు నటించటాన్ని సహించలేక హృదయభారంతో కళ్ళు మూసుకుంది.

ప్రాణ స్నేహితురాలనుకున్న పద్మ తనను ఆదుకోలేదు. రమనే వెయ్యిరెట్లు మేలనిపించింది. ఏదో సర్ది చెప్పటానికి ప్రయత్నించింది.

అయినా ఇంతవరకు వారిద్దరూ రాలేదు. తనను తప్పుకు తిరిగారు. పనిపిల్ల వచ్చి గుర్తుచేసేవరకు తాను కాఫీ త్రాగలేదని అనిపించలేదు. కాఫీ త్రాగి మళ్ళీ పడుకుంది. హృదయంలో దిగులు నిండుకుంది. తను ఒక్కత్తీ వెళ్ళి రాంగోపాల్‌గార్ని కలుసుకుని తను తొందరపడి ఆహ్వానించినట్లు చెప్పుకుని, అన్యధా భావించక క్షమించమని అడగాలి.

అతనెవరు? ఎలాంటివాడు? అర్థం చేసుకుని ఏమీ జరగనట్లు ఫీలయి క్షమించగలడా? ఈ సంఘటన అతడి హృదయంలో ఎలాటి ముద్రవేస్తుంది? తనపై ఎంతటి దురభిప్రాయం కలుగుతుందో? అతడు పరాయివాడే. మరి అతడి ముఖం తను చూడదు. ఐనప్పటికీ తను ఒకరి దృష్టిలో చులకనైపోతుంది. ఇంతటి అవమానం తను భరించగలదా? అతడు ఆరా తీస్తే తను పద్మ సంగతి చెప్పకుండా ఉండగలదా? రమ ఓ చిటికెన వ్రేలెడు మోసంత సాయమైనా చేసింది. తనకు హామీ ఇచ్చి పెత్తనమంతా తనదేనన్నట్లు వ్యవహరించి చివరికి తను గోతిలో పడితే చూస్తూ నుంచున్నదేగాని ఏం చెయ్యలేదు. స్నేహమంటే ఇదేనా? అవసరానికి కలిసి తిరగడమేనా స్నేహభావమంటే? తన అవసరం వారికెంతేనా ఉంది. ఇంటినించి తాను తెచ్చుకున్న పనిమనిషి సాయం మొదలు చేబదుళ్ళకు – క్లాసులు కొన్ని తీసుకోటానికి, ఎస్సేలు దిద్దటానికి...బాబోయ్ తననించి వారికెంత లాభం. అలా అని తను పిలవలేదు. స్నేహాన్ని అతి ఉన్నత స్థాయిలో నిల్పి పవిత్రబంధంగా, తలంచే తను వారి చేతల్లో అపార్థం కనబడలేదు కానీ ఇప్పుడు తనొక కీలుబొమ్మలా కనబడ్తోంది తనకే. స్నేహాన్ని ఇలా తూచేవారిని ప్రథమంగా వీరినే చూస్తోంది. ఆశ్చర్యమూ వేస్తోంది.

పనిపిల్లను పిలిచింది. "పద్మమ్మ గారూ, రమగారూ వచ్చారా?" అని అడిగింది వారు రాలేదని తెలిసికూడా.

"పద్మమ్మగారు నాలుగ్గంటల బండికి బెంగుళూరుకి వెళ్ళిపోయారమ్మా. వాళ్ళ ఇంటివాళ్ళు మన గిన్నెల్ని ఇవ్వటానికొచ్చి చెప్పారు. మీరుండరని గిన్నెలు వారికి అప్పగించి పోయారట."

శాంతికి ఆశ్చర్యం కలగలేదు. అయితే తనకు చెప్పకుండానే బండెక్కి వెళ్ళిపోయిందన్నమాట.

"రమమ్మగారొచ్చారు. మీరింకా రాలేదు. అయ్యగారు కూడా వచ్చారు. ఓ అరగంట కూర్చుని వెళ్ళారు."

"పోనీ.. వచ్చింది. చాలు" అనుకుంది.

కళ్ళు గట్టిగా మూసుకుంది. తను రాంగోపాల్ దగ్గరికి వెళ్ళాలి. ఎలా సంభాషణ ప్రారంభించాలో రిహార్సల్ వేస్తోంది మనసులో. ఇంతలో పనిపిల్ల అటువేపుగా రావటం చూసి దీన్నికూడా తీసుకెళ్తాను అనుకుని గబుక్కున లేచింది. గబగబా తయారై రిక్షా తీసుకుని పనిపిల్లతో కలసి రాంగోపాల్ ఇంటికెళ్ళింది.

అతడు ఒంటరిగానే ఉన్నాడు. శాంతి ఒంటరిగా రావటం చూసి విస్తుపోయాడు. ఎంతో ఆదరంతో ఆహ్వానించి కూర్చోమని చెప్పి తనూ కూర్చున్నాడు.

ఎలా ప్రారంభించాలో శాంతికి అర్థం కాలేదు. కొంతసేపు ఆగి మెల్లగా అంది. "కొన్ని విషయాలలో నాకనుభవం లేదండి. ఆ క్షణాన ఏది తోస్తే అది చేస్తుంటాను. అలా చేయటం తప్పే, కానీ అది నా బలహీనత. నిన్న మిమ్మల్ని కొన్ని క్లాసులు తీసుకొమ్మని కోరాను. మీరెంతో సహృదయంతో అంగీకరించారుకాని మా ప్రిన్సిపాల్ మనసు మారిపోయిందట. ఎలాగైనా సరే నేను నళినిగారే శ్రమపడి కోర్సులు పూర్తిచేయాలట. కనక మీరు నా పరిస్థితినర్థం చేసుకుని మన్నించాలి.

ఇలా అవుతుందనుకోలేదు" రాంగోపాల్ ఆమె మాట వింటున్నట్లులేదు. ఆమెకేసి తదేకంగా చూస్తుండిపోయాడు. ఆమె ఆపటం గమనించి "ఏమన్నారూ?" అన్నాడు తడుముకోకుండా.

శాంతి గాభరా పడింది. అవమానంతో కృంగిపోతూ అతి నెమ్మదిగా అంది. "నన్ను క్షమించాలి. ఆ కోర్సును నేనే పూర్తిచేస్తాను"

రాంగోపాల్ మాట్లాడలేదు. గబగబా వెళ్ళి ఓ ఉత్తరం పట్టుకొచ్చి శాంతి చేతిలో ఉంచుతూ అన్నాడు.

"నేను ఇందుకేమీ బాధపడటంలేదు. క్షమించటానికి మీరు నేరం చేయలేదుగా? ఈ లేఖ చదవండి"

తడబడ్తున్న హస్తాల్లోకి ఉత్తరం ఉంచాడు.

అది రమ రాంగోపాల్‌కు రాసిన లేఖ. అది చదవటానికి నిమిషం కూడా పట్టలేదుకానీ అది మూసి అతనికి ఇవ్వటానికి కొన్ని గంటలు పట్టినట్లుంది.

ఆమె మౌనాన్ని భంగపర్చటం ఇష్టంలేకపోయినా, అతడన్నాడు "నిన్న సాయంత్రం రమగారి భర్తగారొచ్చారు. జరిగిన విషయాన్ని నాకు వివరించి ఈ ఉత్తరం నాకిచ్చి రమగారి మాటగా నన్ను క్షమాపణ వేడి వెళ్ళిపోయారు. రమగారు చిన్నలేఖ రాశారు. కానీ అందులో వారి వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైందో తేలిపోయింది. నేనేం బాధపడటంలేదు. మీరుగా మీరు ఇలావచ్చి అడుగుతుంటే నాకెంతో ఆనందంగా ఉంది. శాంతిగారు బహుశః మీరిలా వచ్చి నన్ను క్లాసులు తీసుకొమ్మని అడగటమూ ఒకందుకు మంచిదే అయిందేమో? మిమ్మల్ని చూసే భాగ్యం కలిగింది. ఈ ఇరవైనాలుగు గంటల్లో మీగురించే చాలాసార్లు ఆలోచించాను."

శాంతి తనను చూస్తున్నా ఆ కళ్ళు తనను చూడటంలేదు. ఆమె ముఖంలో ఏ విధమైన మార్పు లేదు. తన మాటల్లోని అర్థాన్ని ఆ లోతైన భావాన్ని ఆమె అర్థం చేసుకున్నట్లు లేశమాత్రంగానైనా ఆ వదనంలో కనిపించటంలేదు. ఆమె ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది.

"శాంతిగారూ ఏదో ఆలోచిస్తున్నారు" నిరాశ ధ్వనించిందా మాటలో.

ఆమె చటుక్కున ఈమాటు అతణ్ణి చూసింది.

"ఓ.. అయాం సారీ.. ఔను, నామనసెటో పోయింది."

"నాకు తెలుసు. రమగారి ఉత్తరాన్ని గూర్చి, ఆమె స్నేహశీలతను గూర్చి తలుస్తూ, తన్మయత్వంతో నా ఉనికి మర్చిపోయారు."

శాంతి ముఖం ఆనందంతో వికసించింది. "ఔను నన్ను, ఈ ఉచ్చులో బిగించేశారని బాధపడ్డాను. మీకు ఆ పరిస్థితులని వివరించి క్షమించమని అడగవలసిన భారం నాకే వదిలేసి వెళ్ళిపోయారని ఎంతగానో కుమిలిపోయాను. కానీ

రమ నాకెంతో మేలు చేసింది. ఆమె నిండైన హృదయంతో స్నేహితురాలిగా నాకు చేయవలసిన సహాయం చేసింది. అవసరానికి కాకపోతే స్నేహితులెందుకు చెప్పండి?"

"ఔను – నాకు రమగారికన్నా పద్మగారితో పరిచయమెక్కువ. ఐనా వారి తీరువేరే అని బోధపడ్తుంది. స్నేహానికి – స్నేహధర్మానికి విలువ ఇవ్వని వారిని నలుగురు మెచ్చరు. పైపైకి వారి స్నేహాన్ని అంగీకరిస్తారేగాని అవసరానికి కాదు. వారిని దూరంగానే ఉంచుతారు. ఇదొక పవిత్రబంధం. స్నేహం అనేది మొక్కలాంటివి. సరిగా నీళ్ళు పోసి పెంచామా చక్కగా వర్ధిల్లుతుంది కాని కొంచెం నిర్లక్ష్యం చేసి దానికి విలువ ఇవ్వకపోతే అది వాడిపోతుంది. మరిక చిగురించదు. ఈ స్నేహితురాలివలన నాకేమి లాభమా? అని ఆలోచించడానికి మారుగా ఈ స్నేహితురాలికి నావలన ఏం లాభం? అని ఆలోచించాలి. అపుడే ఈ అనిర్వచనీయ బాంధవ్యం ముడివీడని బంధమై హృదయాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోతుంది. ఇచ్చి పుచ్చుకోటాలు లేకపోయినా ఒకరి సాన్నిధ్యంలో మరొకరు పరిపూర్ణ ఆనందాన్ని అనుభవిస్తారు. కొన్ని క్షణాలు మంచి స్నేహితుడితో గడిపితే చాలు, వేయి ఏనుగుల బలాన్ని పుంజుకోవచ్చు. హృదయ ఔన్నత్యానికి ఇటువంటి సంపర్కం అతి ముఖ్యం. అందుకే మీ స్నేహాన్ని అంతకన్నా ఎక్కువైన మీ హృదయాన్నీ కోరుతున్నాను."

శాంతి ఈమాటు పరధ్యానంగా వినకుండా లేదు. ఆఖరిమాటలకామె కలవరపాటుతో చూసింది. ఏమిటి తను వింటున్నది? ముఖంలో ఆశ్చర్యం, హృదయంలో ఓ విధమైన సంశయం ఆవరించాయి.

అతను అన్నాడు "మీరు దీర్ఘంగా ఆలోచిస్తున్నప్పుడే చెప్పాను. మీరు వచ్చి వెళ్ళిన తర్వాత మీ గురించి ఇప్పటివరకు ఆలోచిస్తూనే ఉన్నాను. మీరిలా రావటంతో మీ విలువ నా దృష్టిలో హెచ్చింది. మీలాంటి సంస్కారవంతులు చాలా అరుదుగా తటస్థపడ్తుంటారు."

వ్యవధి కావాలని మెల్లగా చెప్పి ఇంటికి వెళ్ళిపోయింది. మరి మూడు రోజులకు రమ దగ్గరనించి ఉత్తరమొచ్చింది. అందులో కొన్ని విషయాలు తనకు తెలియవు కూడా.

"..రిజర్వేషన్ అయిందని ప్రయాణంకాక తప్పలేదు. నీకోసం చూసానుగాని నువ్వు రాలేదు. నాకు తెలుసు నీ బాధ. అందుకని రాంగోపాల్‌గారికి ఉత్తరం రాశాను. నళినిగారి దగ్గరకెళ్ళి నీకు ప్రోత్సాహమిచ్చి రాంగోపాల్‌గార్ని ఆహ్వానించటానికి తీసుకెళ్ళింది నేనేనని క్షమాపణ వేడాను. ఆమె విశాల హృదయంతో మన్నించారు. ప్రిన్సిపాల్‌ను కలిసి చెప్పాను. ఆమె కొంతసేపు లెక్చర్ యిచ్చి ఫరవాలేదు. ఈసారికి పోనిద్దాం అన్నారు. రాంగోపాల్‌గారికి మరొక ఉత్తరం రాస్తున్నాను."

ఆ ఉత్తరంలో ఒక్క విషయం లోపించినట్లు కొట్టవచ్చినట్లనిపిస్తోంది. పద్మను కలుపుకోలేదు. నేరం తనమీదనే వేసుకుంది. తన ఆందోళనను బాధను నివృత్తి చేయడానికి రమ ఎంత తాపత్రయపడుతుంది. స్నేహానికి వేరే నిర్వచనం దేనికి? ఆమె కళ్ళు చెమర్చాయి.

రాంగోపాల్‌కు, శాంతికి నెలరోజుల్లో పెళ్ళయిపోయింది. పోర్షన్స్ ముగించటానికి కాబోయే భర్తగా రాంగోపాల్ శాంతికి సాయం చేశాడు.

వివాహానికి రమ లేఖ రాసింది. చక్కటి చీర బహుమానంగా పంపింది. పద్మనించి లేఖ లేదు. అందరూ పంపినట్లు టెలిగ్రాం పంపింది. ఆ టెలిగ్రాంలోని విషెస్‌ను సీరియస్‌గా తీసుకోలేకపోయింది శాంతి. ఆ అక్షరాలు పొడిపొడిగా కాగితం మీద అతికించిన అక్షరాల్లాగానే కనబడినై. అది తెచ్చిన ఆశీస్సులను అందుకోలేకపోయిందామె హృదయం.

COMMENTS